వణికిస్తున్న మిచాంగ్ తుపాను

- జలమయంగా మారిన లోతట్టు ప్రాంతాలు
- పాఠశాలలకు సెలవులు ప్రకటించిన విద్యాశాఖ
- ఈదురుగాలులు, వర్షానికి నేలవాలిన వరి పంట
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న యంత్రాంగం


సుందరయ్య కాలనీలో చప్టా వద్ద వర్షపు నీరు ప్రవహించేలా చేయిస్తున్న కమిషనర్ కొలిమి షమ్మి

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ బలపడటంతో సోమవారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుపాను కారణంగా అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఆరుగాలం కష్టపడి పండించుకున్న పంట చేతికందే దశలో వర్షాలు పడడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. వర్షాల కారణంగా కోత దశలో ఉన్న వరి పంట నేల వాలిపోవడంతో పాటు ముంపున పడుతుండటంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా తుపాను కారణంగా ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా ప్రజలు మంగళవారం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముందు జాగ్రత్తగా పాఠశాలలు, కళాశాలలకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. డివిజన్, మండల స్థాయి అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారడంతో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. 19వ వార్డు సుందరయ్య కాలనీలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దగ్గర చప్టాలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. చప్టాలలో నిలిచిపోయిన చెత్తను, ఇతర వ్యర్థాలను శుభ్రం చేయించి వర్షపు నీరు ప్రవహించేలా చేశారు. మాస్టిన్‌పేట, వడ్డవల్లి పోలేరమ్మ గుడి ఏరియా, నాగన్న కుంట, అంబేడ్కర్ నగర్, తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ షమ్మి లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాలు కురుస్తున్నందువల్ల అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటికి రావాలని, చిన్నపిల్లలను బయటకు పంపరాదన్నారు. వర్షానికి చెట్ల కొమ్మలు విరిగిపడితే వెంటనే సమాచారం తెలియజేయాలన్నారు. ముంపు ప్రాంత పరిధిలో అత్యవసర సమయంలో సాగర్, మున్సిపల్ ఏఈ 9849907306, విజయ సారథి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ 9849907932 నంబర్లకు కాల్ చేయాలన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వాగులు వద్ద వర్షపు నీటితో పాటు పైనుంచి నీరు ఎక్కువగా వస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు. నందిగామ చప్టా వద్ద రెవెన్యూ, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారన్నారు. చప్టాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. తుపాన్ కారణంగా గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. సచివాలయ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

ముప్పాళ్ళ: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పత్తి, మిరప పొలాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. రైతులు ముందస్తు చర్యలలో భాగంగా వర్షపు నీటిని కాల్వలు ద్వారా బయటకు పంపించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

సత్తెనపల్లి–నరసరావుపేట ప్రధాన రహదారిపై ఇరుకుపాలెం వద్ద రహదారి పక్కనే ఉన్న చింత చెట్టు విరిగి పడటంతో చెట్టు కొమ్మలు అప్పుడే వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు తగిలి ముందు అద్దం పగిలిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవటంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు వెంటనే స్పందించి ఒక అరగంటలో చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కాగా తహసీల్దార్ కార్యాలయంలో 24 గంటల తుపాన్ కంట్రోలు రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎం.భవానిశంకర్ తెలిపారు. ఆ మేర సిబ్బందిని నియమించామన్నారు. అత్యవసర సమయాల్లో 9949098616 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్రోసూరులో తుపాను వర్షం

క్రోసూరు: తుపాను ప్రభావంతో మండలంలోని అన్ని గ్రామాల్లో జోరు వాన కురిసింది. వీధులు, పంట పొలాలన్నీ జలమయమయ్యాయి, ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వానకు ప్రజలు బయటకు రాలేకపోయారు. వరి, పత్తి, మిర్చి పంటలు నీట మునిగాయి. విద్యుత్ తీగలు తెగి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

ఎడతెరపిలేని వర్షం

నకరికల్లు: మండలంలో మిచాంగ్ తుపాను ప్రభావంతో ఎడతెరపిలేని వర్షం కురుస్తుంది. సోమవారం రాత్రి మొదలైన వర్షం మంగళవారం రోజంతా కురుస్తూనే ఉంది. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి మంగళవారం ఉదయం 7గంటల వరకు 46.6 మిల్లీమీటర్ల వర్షపాతం, అలాగే మంగళవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 70.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కె.నగేష్ తెలిపారు. కాగా ఎడతెరపిలేని వర్షానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని వీఆర్వోలకు, సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు.

నీటతడుస్తున్న పంటలు..

మిచాంగ్ తుపాను ప్రభావంతో పంటలు నేలకొరిగాయి. పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. మండలంలో వరి, మొక్కజొన్న, మినుము, కంది, శనగపంటలను ప్రస్తుతం సాగుచేస్తున్నారు. గత రెండు రోజులుగా ఎడతెరపిలేని వర్షం కారణంగా కోతకు వచ్చిన వరిపైరు నేలవాలింది. శనగ, మొక్కజొన్న, మినుము, కంది పంటలు వర్షపునీటిలో తడుస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లో పలుచోట్ల నీరు నిలుస్తుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయా పంటలు సాగుచేస్తున్న రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తుపాను కారణంగా సంభవించే పంట నష్టాన్ని అరికట్టేందుకు రైతులకు పలు సూచనలు చేశారు. వరి పొలంలో నిలిచిన నీటిని చిన్నకాలువల ద్వారా బయటకు వెళ్లగట్టాలన్నారు. వరికంకులు మొలక రాకుండా వరివెన్నులపై 5శాతం ఉప్పుద్రావణం పిచికారీ చేయాలన్నారు. పైరు పనలను ఉప్పు ద్రావణంలో ముంచడం ద్వారా నష్టం నివారించవచ్చన్నారు. మొక్కజొన్న, కంది, శనగలో ముంపు నీటిని వెంటనే బయటకు వెళ్లగట్టాలన్నారు. ఎకరాకు 20–30 కేజీల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువును పైపాటుగా వేయాలన్నారు.

సహాయకచర్యల కోసం కంట్రోల్‌రూం ఏర్పాటు..

తుపాను ప్రభావంతో మూడురోజుల పాటు వర్షాలు ఉన్నందున సహాయకచర్యల కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.నగేష్ మంగళవారం తెలిపారు.

వరి, పత్తి పంటలకు అపారనష్టం

అచ్చంపేట: తుపాన్ ప్రభావంతో సోమ, మంగళవారాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి, వరి, మిర్చి పొలాల్లో నీళ్లు నిలబడ్డాయి. తాళ్లచెరువు, అచ్చంపేట, నీలేశ్వరపాలెం, పెదపాలెం, ఓర్వకల్లు, రుద్రవరం, కోనూరు, కస్తల, వేల్పూరు తదితర గ్రామాలలో వరి పొలాలు నేలమట్టమయ్యాయి. కోతదశలో ఉన్న పత్తి పంట తడిసి రంగుమారే అవకాశం ఉండటంతో కనీస ధర కూడా పలికే అవకాశాలు లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పుడే కాయ దశకు వస్తున్న మిర్చి పూర్తిగా తడిసి తాలుకాయగా మారే అవకాశాలున్నాయంటున్నారు.

అత్యధికంగా పెదకూరపాడులో 57.2 మి.మీ. వర్షపాతం

సత్తెనపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ కారణంగా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం సత్తెనపల్లి డివిజన్‌లో అత్యధికంగా పెదకూరపాడులో 57.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా క్రోసూరులో 25.2 మి.మీ వర్షపాతం నమోదైంది. డివిజన్లో మండలాల వారీగా నమోదైన వర్షపాతం ఇలా...

పెదకూరపాడు	57.2 మి.మీ
సత్తెనపల్లి	50.8 మి.మీ
ముప్పాళ్ళ	47.0 మి.మీ
నకరికల్లు	46.6 మి.మీ
అమరావతి	38.2 మి.మీ
రాజుపాలెం	37.4 మి.మీ
బెల్లంకొండ	35.6 మి.మీ
అచ్చంపేట	32.0 మి.మీ
క్రోసూరు	25.2 మి.మీ

సహాయక చర్యల కోసం కంట్రోల్‌రూం ఏర్పాటు..

తేదీ	పేరు, హోదా	సెల్‌నెంబర్
05-12-2023	జి.రాజగోపాలరెడ్డి, సీనియర్ అసిస్టెంట్	9866054724
05-12-2023	జి.కనకయ్య, వీఆర్‌ఏ	9908909078
06-12-2023	సీహెచ్ యువరాజు·ఆర్‌ఐ-1	9182596258
06-12-2023	బి.శ్రీనివాసరావు,వీఆర్‌ఏ	9703144224
06-12-2023	శ్రీనివాసరావు, ఆర్‌ఐ-2	7675073184
07-12-2023	ఐ.కోటేశ్వరరావు,వీఆర్‌ఏ	7993581535
07-12-2023	సీహెచ్.పురుషోత్తం,టైపిస్ట్	9381063193
07-12-2023	ఐ.యాకోబు,వీఆర్‌ఏ	9866417688


జలమయంగా మారిన పట్టణంలోని మాస్టిన్ పేట


క్రోసూరులో జోరున కురుస్తున్న వర్షం

క్లుప్తంగా

అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం



క్రోసూరు: క్రోసూరులోని అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు నిర్వహించే సద్ది కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం పాల్గొని అన్నదానం ప్రారంభించారు. స్థానిక శివాలయంలో సేవాసమితి ప్రతి ఏటా 41 రోజుల పాటు మాలధారులకు ఉచిత సద్ది కార్యక్రమం గత 11 సంవత్సరాలుగా నిర్వహిస్తోంది. ఎమ్మెల్యే సద్ది కార్యక్రమానికి కావాల్సిన 45 క్వింటాళ్ల బియ్యం ఉచితంగా అందజేశారు. గురుస్వాములు, మాలధారులకు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

రీసర్వే రికార్డులను త్వరగా పూర్తిచేయాలి



రాజుపాలెం: రీసర్వే రికార్డులను త్వరగా పూర్తి చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి రీసర్వే రికార్డులను, ఎలక్షన్‌కు సంబంధించిన దరఖాస్తులను మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుపాన్ సందర్భంగా వీఆర్వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్దారు నళిని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



రాజుపాలెం: మండలంలోని గణపవరం, రాజుపాలెం తదితర గ్రామాల్లో వరి పంట పొలాలను వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య మంగళవారం పరిశీలించారు. తుపాన్ ప్రభావం వలన వరి పంటలు దెబ్బతినకుండా ఉండేందుకు రైతులకు సలహాలు, సూచనలు అందించారు. వరి పంట కోతకు సిద్ధంగా ఉన్న వరిలో సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలలో ఆరబెట్టుకోవాలని తెలిపారు. వరి పంట కోసి ఉంటే వెంటనే కట్టలు కట్టి కుప్పలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పత్తి, మిరప పంట పొలాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఇప్పటి వరకు మండలంలో ఏ ఒక్క పంటకు నష్టం వాటిల్లలేదని తెలిపారు.

చోరీపై కేసు నమోదు



సత్తెనపల్లి: ఇంటి ముంగిట నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పాత సుగాలికాలనీలో నివసిస్తున్న గార్లపాటి అభిషేక్ తన ఎంసీవైఎన్ 200సీసీ ఏపీ 39ఎల్ డీ4841 నెంబర్ గల ద్విచక్ర వాహనాన్ని రాత్రి పది గంటల సమయంలో ఇంటి ముందు నిలిపి తాళం వేశాడు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు బయటికి రాగా వాహనం మాయమైంది. ఎక్కడ వెతికినా లభించకపోవడంతో పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన



క్రోసూరు: తుపాను వర్షాలు అధికంగా కురుస్తుండటంతో నీట మునిగిన పంటలను ఏవిధంగా సంరక్షించుకోవాలో క్షేత్రస్థాయిలో సందర్శించి ఏవో వేణుగోపాల్ మంగళవారం రైతులకు తగు సూచనలు చేశారు. మండలంలోని అందుకూరు, క్రోసూరు, ఎర్రబాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి పైర్లను చూసి రైతులకు తగు విధంగా సస్యరక్షణ సూచనలు చేశారు. వరి నీట మునిగితే బూజు తెగుళ్ల వల్ల గింజ రంగు మారే అవకాశముంటుందని, వర్షాలు తగ్గిన వెంటనే 1 మిలీప్రాపికొనజోల్ లేదా 1 గ్రాము కార్బండిజం లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి పైరు కోసి పనలపై ఉన్నప్పుడు ఉప్పుద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. పత్తి, మిర్చి పంటల సస్యరక్షణకు తగు సూచనలు చేసారు.

కోళ్లూరు ప్రసన్నాంజనేయుని ఆలయ అభివృద్ధికి కృషి

పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయుని ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. ఈ నెల 8న నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, దేవదాయ శాఖ అధికారులతో గుంటూరులోని కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన ఆలయాలలో కోళ్లూరు ఆంజనేయ స్వామి ఆలయం ఒకటిగా ఉందన్నారు. పులిచింతల ముంపు గ్రామమైన కోళ్లూరు గ్రామం నుంచి 2014లో ఆలయాన్ని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్దకు తరలించారన్నారు. నూతన ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం 2.88 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. అనంతరం పోస్టర్లను ఎమ్మెల్యే కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈవో వెంకటేశ్వర రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఆలయ చైర్మన్ మర్రి ప్రసాదరెడ్డి, సభ్యులు పత్తి శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, మల్లయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించండి

ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి


మాట్లాడుతున్న ఆర్డీవో రాజకుమారి

సత్తెనపల్లి: స్వచ్ఛమైన ఓటర్ జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎస్ రాజకుమారి అన్నారు. ఎన్నికల కమీషన్, పల్నాడు జిల్లా ఎన్నికల ముఖ్యాధికారి ఆదేశాల మేరకు పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండి అర్హత కలిగి ఓటు హక్కు లేని వారందరూ ఈ నెల తొమ్మిదిలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎస్ఎస్ఆర్–2024లో భాగంగా అక్టోబర్ 27న ప్రచురించిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సూచనలు కోరారు. స్పెషల్ క్యాంపెయిన్‌లో స్వీకరించిన దరఖాస్తులు, నియోజకవర్గంలో గతంలో ఫైనల్ పబ్లికేషన్ నుంచి ఇప్పటివరకు చేర్చబడిన, తొలగించబడిన, సవరింపబడిన ఓట్ల వివరాలను తెలియజేశారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మిర్చిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉద్యానవన శాఖ అధికారి వై.మోహన్

పిడుగురాళ్లరూరల్: మిచాంగ్ తుపాన్ నేపథ్యంలో మిర్చి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి వై.మోహన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అధిక వర్షాల వలన లోతట్టు ప్రాంతాలలో నీరు నిలబడి మిరప పంట ముంపునకు గురై నష్టం వాటిల్లుతుందన్నారు. అధిక తేమ వలన అవసరమైన పోషకాలు అందక పంటను పురుగులు, తెగుళ్ల ఆశించడమే కాకుండా సూక్ష్మధాతులోపాలు కూడా కనబడే అవకాశముందన్నారు. పంట దశ, ముంపు ఉధృతిని బట్టి తగిన జాగ్రత్తలు పాటించినట్లయితే పంటను రక్షించుకొని నష్టాన్ని కొంత వరకు తగ్గించుకునే అవకాశం ఉందన్నారు. మిరప పంట ప్రస్తుతం పూత నుండి కాయ ఏర్పడే దశలోను, లేదా శాఖీయ దశలో ఉందన్నారు.

తీసుకోవాల్సిన చర్యలు..

పొలంలో అధికంగా వున్న నీటిని వెంటనే బయటికి పంపించే ఏర్పాటు చేయాలి, వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలన్నారు. నేల అదునుకు వచ్చిన వెంటనే గొర్రుతో అంతర కృషి చేయాలన్నారు. మొక్కలు తేరుకున్న తరువాత స్థూల పోషకాల మిశ్రమాన్ని, సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని ఒక దాని తరువాత ఒకటి వారం రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ, కోనోధారా వంటి తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది కాబట్టి, ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్, 1 గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణం పిచికారీ చేసి వీటి వ్యాప్తిని అరికట్టాలన్నారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: మిచాంగ్ తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తుపాను ప్రభావం రేపు, ఎల్లుండి కూడా ఉండే అవకాశాలున్నాయన్నారు. అత్యవసర పనులుంటే తప్ప ఎవ్వరూ బయటకు రావద్దన్నారు. కృష్ణానదీ తీరప్రాంతాలలో ఎవ్వరూ చేపలు పట్టేందుకు నదిలోకి వెళ్లొద్దన్నారు. కృష్ణానదిపై బల్లకట్టు, పడవలను వెంటనే నిలిపివేయాలన్నారు. ప్రవహించే వాగులు, కాలువలు దాటే ప్రయత్నాలు చేయొద్దని, చెట్ల క్రింద, కూలే పరిస్థితులలో ఉండే మిద్దెలు, భవనాలలో ఉండొద్దని సూచించారు. తక్షణమే పునరావాస క్షేంద్రాలు ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సహాయక చర్యల్లో పోలీస్, రెవెన్యూ అధికారులు ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడితే ఏ సమయంలోనైన తనకు తెలియచేయాలని చెప్పారు.

ఆస్పత్రిలో పింఛను అందజేత

దుర్గి: అనారోగ్యంతో నరసరావుపేటలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబానికి చెందిన మహిళకు పెన్షన్ అందించిన సంఘటన జరిగింది. మండల కేంద్రం దుర్గికి చెందిన బండ్ల నాగమణి అనారోగ్యంతో నరసరావుపేటలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. పేద కుటుంబం కావటంతో ఆస్పత్రిలోని ఖర్చులకు డబ్బు అవసరాన్ని గుర్తించిన వలంటీర్ తాళ్ళూరి శిరీష తన సొంత ఖర్చులతో నరసరావుపేట వెళ్లి నాగమణికి పెన్షను అందజేసింది.

భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తం


లింగాపురం వద్ద నేలవాలిన వరిపైరు


వైకుంఠపురంలో కంది పైరును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

అమరావతి: మిచాంగ్ తుపాన్ వల్ల సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు స్థానిక మెయిన్‌రోడ్డులో డ్రైనేజీలు పొంగి మురుగు నీరుతో వర్షపు నీరు కలిసి రోడ్లపై ప్రవహించింది. క్రోసూరు రోడ్డులోని పెట్రోలుబంకు సెంటరు వద్ద, శ్రీ రామకృష్ణా హిందూహైస్కూల్ ఆవరణ వర్షం నీటితో నిండిపోయింది మండల పరిధిలో కురిసిన భారీ వర్షాలకు వరిపైరు నేలకొరిగింది. అలాగే పుల్లశనగ, మిరప చేలలో కూడా వర్షపునీరు చేరింది.


తడిసిపోతున్న పత్తి..

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి చేట్లమీద నుండి తీయకుండానే తడిసి పోతుంది. పత్తి తీయటానికి సిద్ధంగా ఉన్న సమయంలో కూలీల కొరత, తుపాన్ రావటంతో దిక్కుతోచని పరిస్థితులలో రైతులు ఉన్నారు. రెండవకాపు పత్తి కాయలు పగిలి ఉండటంతో ప్రస్తుత వర్షాల కారణంగా ఈ కాపు దెబ్బతింటే ఇబ్బందేనని రైతులు వాపోతున్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయశాఖాధికారులు..

మండల పరిధిలోని అమరావతి, వైకుంఠపురం, లింగాపురం, నరుకుళ్ళపాడు, పెదమద్దూరు గ్రామాలలో వ్యవసాయశాఖ క్రోసూరు డివిజన్ ఏడీ వి.హనుమంతరావు, మండల వ్యవసాయ శాఖాధికారి అహ్మద్ వ్యవసాయశాఖ సిబ్బంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ పత్తి, మిరప, శనగ, కంది, మినుము చేలలో వర్షపు నీటిని సాధ్యమైనంత త్వరగా బైటకు పంపాలి, వర్షాలు తగ్గిన తర్వాత తెగుళ్లు సోకకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలన్నారు. అలాగే వరి సాగు చేసే రైతులు కంకులను నిలబెట్టి కట్టలు కట్టాలన్నారు.

పంచాయతీల్లో డిజటల్ లావాదేవీలు


స్వైపింగ్ మిషన్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపీఆర్‌డీ దయాసాగర్

సత్తెనపల్లి: పంచాయతీల్లో అన్ని లావాదేవీలు డిజిటల్‌లో జరగాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు స్వైపింగ్ మిషన్‌లు, క్యూఆర్ కోడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఇంటి పన్ను అన్ని రకాల పన్నులు, ఆదాయ లావాదేవీలు అన్నీ డిజిటల్‌లోనే జరగాలన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ దయాసాగర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

ఆసుపత్రిలో వృద్ధురాలికి పింఛన్ అందజేత


పింఛన్ నగదు వృద్ధురాలికి అందచేస్తున్న వలంటీర్ కృష్ణ

ఎర్రబాలెం(క్రోసూరు): ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి వలంటీర్ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మంగళవారం పింఛన్ అందజేశాడు. మండలంలోని ఎర్రబాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు సుగుణపుష్పావతి కాలికి గాయం అవటంతో సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. సమాచారం తెలుసుకున్న వలంటీర్ కృష్ణ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ నగదు అందజేయటం జరిగింది.